క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొం దించు కోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ థియేటర్‌లు, ల్యాబ్‌లు తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు.కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సీతారాం, సురేష్‌కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 70 మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న డ్వామా జిల్లా ఏపీడీ శ్రీహరి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ వేతనదారులతో ప్రతి గ్రామంలో 70 మొక్కలు వంతున క్షేత్ర సహాయకులు నాటించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ జిల్లా ఏపీడీ శ్రీహరి సూచించారు. ఈ మేరకు బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల కార్యాలయంలో ఏపీఓ భాను అధ్యక్షతన ఉపాధిహామీ పనుల ప్రగతి, భవిష్యత్‌లో చేపట్టవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీహరి మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకం అమలులో భాగంగా గ్రామాల్లో చెరువుల అభివృద్ధి పనులు చేసిన ప్రాంతాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే పనులు నిర్వహించనున్న చోట్ల ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధిహామీ మండల సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి



వాహన చోదకులతో మాట్లాడుతున్న ఎస్సై కె. నీలకంఠం

సీతానగరం: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో ద్విచక్ర, ఇతర వాహన చోదకులు సహకరించాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రహదారిపై హనుమాన్ జంక్షన్ కూడలిలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి కూడలి వద్ద సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో వేగాన్ని నియంత్రించి ఇతర వాహనాల రాక పోకలను గమనించి నడపాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని డ్రైవింగ్‌లో అనుభవం లేనివారికి వాహనాలను ఇవ్వరాదని హితవు పలికారు. అలాగే వాహలనాపై విధించిన చలానాల పాత బకాయిలను చెల్లించాలని కోరారు.

మండల సమాఖ్యలు ఆదాయం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ వై.సత్యం నాయుడు

పార్వతీపురం టౌన్: జిల్లాలోని మండల సమాఖ్యలు ఆదాయం పెంచుకోవాలని వెలుగు ఏపీడీ వై.సత్యం నాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఆర్థిక సుస్థిరతపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో ఆదాయం పెంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వతహాగా వ్యాపారాలు చేసుకుంటూ ప్రతి మండల సమాఖ్య ఆదాయం పెంచుకోవాలని సూచించారు. అందుకు తగిన అవగాహనను సిబ్బంది కల్పించాలని చెప్పారు. నెలలో వచ్చిన ఆదాయంలో 30 శాతంలోపు మాత్రమే నిర్వహణ ఖర్చులు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం ఐబీ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసే జగనన్నకే మద్దతు



చిలకలపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- గ్రామాల్లో జేజేలు పలికిన ప్రజలు
- ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి

బలిజిపేట: రాష్ట్రంలో నిరుపేదలకు అండగా ఉంటూ అవ్వాతాతలు, మహిళలకు భరోసా కల్పిస్తూ ఎంతో మేలు చేస్తున్న జగనన్నకే మామద్దతు అని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు చెబుతున్నారు. ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో చిలకలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు గడపగడపలో అడుగుపెడుతూ అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలు, అన్నాతమ్ముళ్లను పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుంటూ, రాబోయే ఎన్నికలలో తిరిగి జగన్‌మోహన్ రెడ్డినే సీఎంగా



ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

గెలిపించాలని కోరారు. గతంలో పాదయాత్ర సమయంలో, ఎన్నికల ముందు ఇచ్చే హామీలను నెరవేర్చిన గొప్ప వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని చెప్పారు. గత ప్రభుత్వాల పనితీరుతో పోల్చుకుని ఈ ప్రభుత్వానికి మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు.

ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

చిలకలపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే జోగారావు భూమిపూజ చేశారు. రూ.15లక్షలతో 20వేల లీటర్ల తాగునీరు సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, టి.ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.వకీరునాయుడు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, సర్పంచ్ కె.మోహనరావు, ఆర్.శ్రీనివాసరావు, విజయ, జి.జగన్, జి.శ్రీనివాసరావు, జి.సత్యంనాయుడు, పి.నారాయణరావు, పి.రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. చిలకలపల్లిలో వైఎస్సార్ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడుపులో బిడ్డ ఉన్ననాటి నుంచి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. ఈ పథకం కింద నెలకు 3కిలోల బియ్యం, అరలీటరు ఆయిల్ ప్యాకెట్, కిలో కందిపప్పు, 25గుడ్లు, 5లీటర్ల పాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలలో అత్యాధునిక పరికరాలతో మంచి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, సర్పంచ్ సుందరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర

పాచిపెంట: రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయని, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం పాచిపెంటలో మూడవ రోజు బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. కొంతమంది ఇళ్లు లేవని తెలియజేయగా, మరి కొంతమంది వీధి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన రాజన్నదొర సంబంధిత శాఖ అధికారులను పిలిపించి ఇళ్లు మంజూరు, సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తమ ఇంటి వద్దకే వస్తున్న ప్రియతమ నాయకుడికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తమామిడి పార్వతి, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, కేసలి సర్పంచ్ ప్రతినిధి సతారపు రాము, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల ఆదినారాయణ, మంత్రి సత్యనారాయణ, మజ్జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు సమస్యలు చెబుతున్న సమయంలో కొంతమంది అధికారులు అందుబాటులో లేకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల లిస్టు తయారుచేసి కలెక్టర్‌కు పంపించి చర్యలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవో జి.పార్వతిని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రం పాచిపెంటలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడికి రాజన్న దొరకు మండల ఉపాధి ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. పీఆర్‌సీ 2022 అమలు చేయాలని, వివిధ అలవెన్సును బేసిక్ పేలో కలపాలని అలాగే నగదు రహిత హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ భవనాలను గడువులోగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ భవనాలను గడువులోగా పూర్తి చేయాలని పార్వతీపురం సబ్ డివిజన్ పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్ కోరారు. ఈ మేరకు గ్రామాల్లో జరుగుతున్న భవన నిర్మాణాలపై మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళితో పాటు సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెదంకలాం, నిడగల్లు, తామరఖండి, గాదెలవలస,కాశీపేట, వెంకటాపురం పెదభోగిలి- 2 సచివాలయ భవనాలు ప్రారంభించడానికి సిద్ధగా ఉన్నాయన్నారు. మిగతా భవనాలు వివిధ దశల్లో ఉన్నాయని వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయడానికి నిర్వాహకులపై ఇంజినీరింగ్ సహాయకులు ఒత్తిడి తేవాలని సూచించారు.

అంగన్వాడీల్లో టేక్‌హోం రేషన్ పంపిణీ

సాలూరు: పట్టణం, మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో టేక్‌హోం రేషన్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ మేరకు పట్టణంలోని 8వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి తదితరులు, 25వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు తదితరులు టేక్‌హోం రేషన్‌ను అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సత్యవతి మాట్లాడుతూ, నేడు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా అంగన్వాడీ కేంద్రం పరిధిలో గల గర్భిణులు, బాలింతలకు బియ్యం, పప్పు, నూనె, గుడ్లు వంటి పౌష్టికాహారం, వైఎస్సార్‌కిట్స్ పంపిణీ చేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో



8వ వార్డులో టేక్‌హోం రేషన్‌ను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏసీడీపీఓ మంగతాయారు, ఎంఎస్‌కే శ్రీదేవి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు. మండలంలోని శివరాంపురంలో వైఎస్సార్ సంపూర్ణపోషణ ప్లస్‌లో భాగంగా పౌష్టికాహార సామాగ్రిని సర్పంచ్ జర్జాపు మోహన్, అంగన్వాడీ సిబ్బంది అందించారు.

పోషకాహారాన్ని గర్భిణులు భుజించాలి

సీతానగరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పోషకాహారం గర్భిణుల రక్తహీనత నివారణకు దోహదపడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-1లో పెదభోగిలి పంచాయతీలో ఉన్న నాలుగు గ్రామాల గర్భిణులకు సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో సీతానగరం, గుచ్చిమి సెక్టార్ల సూపర్‌వైజర్ యు.పూర్ణిమ పౌష్టికాహారం సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ బాబ్జీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించి రక్తహీనత లోపాన్ని



గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీలు

గర్భిణులు అధిగ మించాలని హితవు పలికారు. కార్యక్రమంలో లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ, పెదభోగిలి 1, 2 ఎంపీటీసీలు ఎస్.గౌరి, బి.కుసుమ, సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ, 5 అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

మక్కువలో తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

మక్కువ: పిల్లలకు డబ్బా పాలు పట్టవద్దని, తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.లీలావతి, పి.రాజశ్రీలు తెలిపారు. మండలకేంద్రం మక్కువలోని నాల్గవ అంగన్వాడీకేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యాన్ని బిడ్డల తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని సూచించారు. దీంతో పిల్లల్లో వ్యాదినిరోధక శక్తి పెంపొందుతుందని చెప్పారు. 6నెలల వరకు బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల ఎదుగదలకు తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా ఉద్యోగం చేస్తున్న మహిళలు'(తల్లులు) అశ్రద్ధ వహించకుండా బిడ్డలకు తల్లిపాలు అందించాలని సూచించారు. పోషకాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాల కోసం బడిదేవర కొండపై పూజలు



బడిదేవర కొండపై పూజలు చేస్తున్న గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: ఈ ఏడాది అనుకున్నంతగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు నిండలేదని పెదబొండపల్లి గ్రామ రైతులు బడిదేవర కొండపై పూజలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం సంప్రదాయ బడిదేవర ఉత్సవాన్ని నిర్వహించారు. ములగ పంచాయతీలో ఉన్న బడిదేవర కొండపై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఓ మోస్తరుగా కురుస్తున్న వర్షాలు భారీ వర్షాలుగా మారి చెరువులు నిండాలని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అమ్మవారికి పూజలు చేసి మొక్కుకున్నారు.

నేడు మన్యం బంద్

కురుపాం: మన్యం బంద్‌కు అందరూ సహకరించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, గిరిజన సంఘం సహాయ కార్యదర్శి పి.తిరుపతిరావు కోరారు. ఆదివాసీ హక్కులు, వారిపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ గురువారం మన్యం బంద్ పాటించనున్నట్టు తెలిపారు. వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.మోహనరావు, కె.సుందరరావు, గిరిజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళావతి పరామర్శ



సుగుణాకర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: పట్టణంలోని పెదకాపు వీధికి చెందిన కిలారి సుగుణాకర్‌రావు కుటుంబాన్ని ఎమ్మెల్యే కళావతి బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీ నాయకుడు అయిన సుగుణాకర్‌రావు మంగళవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, కడగల రమణ, కిల్లారి మోహన్, దుప్పాడ పాపినాయుడు, కోడెం విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల పంపిణీ



జిల్లాకేంద్రాస్పత్రిలో ఎల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆశాలత



సింహాచలానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పార్వతి

సీతానగరం: మండలంలో రెండవరోజూ పింఛన్ కానుకలను బుధవారం ఉదయానికే ఇంటింటికీ వెళ్లి గ్రామ వలంటీర్లు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో వివిధ గ్రామాలకు చెందిన పింఛన్‌దారులు అనారోగ్యానికి గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండడంతో వలంటీర్లు వ్యయ ప్రయాసలకోర్చి ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న పింఛన్‌దారుల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని పణుకుపేట గ్రామానికి చెందిన వై.ఎల్లమ్మ జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నందున వలంటీర్ వై.ఆశాలత ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. అలాగే సీతానగరం గ్రామానికి చెందిన అలజంగి సింహాచలం పార్వతీపురంలోని చికిత్స పొందుతుండడంతో వలంటీర్ ఎస్.పార్వతి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసింది. దీంతో అత్యవసర పరిస్థితో పింఛన్లు పంపిణీ చేసిన జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామని లబ్దిదారులు చెబుతూ వలంటీర్లను అభినందించారు.

బాలగుడబలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం

పార్వతీపురంటౌన్: ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తూ అందుబాటులో ఉన్న 62రకాల మందులు అవసరమైన మేరకు రోగులకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్: మండలంలోని జగనన్న కాలనీలకు కేటాయించిన స్థలాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడుతున్నట్లు పనుకువలస ఎంపీటీసీ సభ్యులు కోట అజేయ్‌కుమార్ అన్నారు. అట్టలి, తుమరాడ పంచాయతీలకు సంబంధించి కేటాయించిన జగనన్న గృహ నిర్మాణ స్థలాల్లో రూ.2 లక్షల విలువ గల రిగ్ బోర్లు బుధవారం ఏర్పాటు చేశారు. భూగర్భ గనుల శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. త్వరలో విద్యుత్, ఇతర సౌకర్యాలు అందుబాట్లోకి వస్తాయన్నారు. ఆయా పంచాయతీల సర్పంచులు కనుముల సంధ్యారాణి, పొట్నూరు శోభారాణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు



అట్టలిలోని జగనన్న కాలనీలో రిగ్ బోర్ ఏర్పాటు చేయిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనుముల కల్పన, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యనారాయణ, కె.దామోదరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పాత కళ్లికోట వద్ద వృద్ధురాలితో మాట్లాడుతున్న అధికారులు

కొమరాడ: ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు నాగావళి నది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని పాత కళ్లికోట గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. నాగావళి నది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం నది ప్రవాహం నిలకడగా ఉందన్నారు. ఇప్పటికే తోటపల్లి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారని, తద్వారా నీటి ప్రవాహన తగ్గుముఖం పడుతుందన్నారు. వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.